ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 22 సెప్టెంబరు 2024

చేప పిల్లల పంపిణీ ఎప్పుడో..?



- పూర్తి కాని టెండరు ప్రక్రియ
- గత బకాయిలతో ముందుకు రాని కాంట్రాక్టర్లు
- వానాకాలం గడిచినా ప్రారంభం కాని ప్రక్రియ

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మత్స్యకారుల సం క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వందశాతం రాయితీతో ఇచ్చే చేప పిల్లలకు జిల్లాలో అడ్డంకులు తొలగడం లేదు. సగం వర్షాకాలం గడిచినా చేప పిల్లలు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. రెండు నెలలుగా కసరత్తు చేస్తున్నామని చెబుతున్న మత్స్య శాఖ పంపిణీ ప్రక్రియను మాత్రం ప్రారంభించడంలేదు. ఎంపిక చేసిన చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు జూలై నుంచి ఇప్పటి వరకు రెండు పర్యాయాలు టెండర్లను ఆహ్వానించి నప్ప టికీ కనీసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేయలేదు. టెండర్లలో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గత యేడాది టెండర్లు దక్కించుకున్న వారికి ప్రభుత్వం ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. సీజన్ ప్రారంభంలో వర్షాలు పడ్డా చెరువుల్లోకి నీరు చేరలేదు. ప్రస్తుతం చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. చేప పిల్లలను ఆలస్యంగా వదిలితే వాటి పెరుగుదల నామమాత్రంగా ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు. కొందరు ఇతర ప్రాంతాల నుంచి చేపపిల్లలు కొనుగోలు చేసి చెరువుల్లో వదలుకుంటున్నారు.

పూర్తి కానీ టెండర్ల ప్రక్రియ...

జిల్లాలోని జల వనరుల్లో ప్రస్తుత యేడాది చేప పిల్లలను వదలడానికి లక్ష్యం ఖరారు అయినప్పటికీ టెండర్ల ప్రక్రియను పూర్తి చేయడం లేదు. ఈ యేడాది జూలై 8వ తేదీన టెండర్లను ఆహ్వానించారు. జూలై 23వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు టెండర్ల స్వీకరణ పూర్తయినప్పటికీ టెండర్ల దాఖలు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో మరోమారు అధికారులు టెండర్లను ఆహ్వానించారు. రెండు పర్యాయం టెండర్ల స్వీకరణ గడువు ఆగస్టు 2వ తేదీతో పూర్తయింది. ఇప్పటివరకు సదరు టెండర్లను అధికారులు ఖరారు చేయలేదు. దీంతో చేప పిల్లల పంపిణీ ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నాయి.

లక్ష్యానికి దూరంగా...

చెరువుల్లో చేపపిల్లలు వదిలే విషయంలో అధికారులు ఎంచుకున్న లక్ష్యానికి వదులుతు న్న వాటికి ఏ మాత్రం లెక్క సరిపోవడం లేదు. ఏటా ఇదే తంతు సాగుతుంది. ఎంచు కున్న లక్ష్యంలో 60 నుంచి 70 శాతం మా త్రమే చేపపిల్లలను వదులుతున్నారు. గతేడాది కూడా ఇలాగే జరిగింది. ఈ సారి మాత్రం చెరువులకు సరిపడా చేపపిల్లలు వదలాలని మత్స్య సహకార సంఘాలు కోరుతున్నాయి. గతంలో మాదిరి కాకుండా నాణ్యమైన చేప విత్తనం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సాధారణంగా మూడు నుంచి నాలుగు ఇంచులు ఉన్న వాటినే చెరువుల్లో వదలాలి. కానీ ఒక ఇంచుకు మించి ఉండటం లేదు. దీంతో అనుకున్న స్థాయిలో ఎదుగుదల రావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేగ వంతంగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని మత్స్య కార్మికులు కోరుతున్నారు.

జిల్లాలో చేప పిల్లల పంపిణీ లక్ష్యం...

ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గానూ జగిత్యాల జిల్లాలో ఉచిత చేప పిల్లల లక్ష్యాన్ని ఖరారు చేసింది. జిల్లా మత్స్య శాఖ అధికారులు రూ. 2.23 కోట్ల విలువ గల చేప పిల్లలను చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదిలేందుకు లక్ష్యం నిర్దేశిస్తూ ప్రభుత్వానికి పంపిన నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి గాను 737 చెరువులలో 18,500 మంది లబ్ధి చేకూరే విధంగా అధికారులు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 254 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో 18,500 మంది సభ్యులున్నారు.

ఓటర్లకు ఇబ్బందులు కలుగొద్దు

- కలెక్టర్ సత్యప్రసాద్



8లో..

కొత్తధామ్‌రాజుపల్లిలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

బాధ్యతలు చేపట్టిన పశుసంవర్ధక శాఖ అధికారి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా డాక్టర్ ఎస్ఎల్ మనోహర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో మహ బూబాబాద్ జిల్లా పశువైద్య కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్(సహాయ సంచాలకులు)గా పనిచేసి డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది, జగిత్యాల జిల్లాకు డీడీగా ని యమితులయ్యారు. పదవీ బాధ్యతలు చేపట్టిన మనోహర్‌ను వెటర్నిటీ యూనియన్ సంఘ బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు కందుకూరి పూర్ణచందర్, రవి, నాగేంధర్‌రెడ్డి, గణేష్, రవీంధర్, ఆనందం, రాజ్‌కుమార్, డీడబ్ల్యూవో భోనగిరి నరేష్, సూపరింటెంట్ అశోక్ కుమార్, సీనియర్ అసిస్టెంట్‌లు సంతోష్‌కుమార్, శైలజ తదితరులున్నారు.

చిన్నారులు, మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి



అక్షరాభ్యాసం చేయిస్తున్న అదనపు కలెక్టర్

పెగడపల్లి, సెప్టెంబరు 21 : చిన్నారులు, మహిళల ఆరోగ్యం పట్ల అంగన్ వాడీలు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతమ్ రెడ్డి అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన, గర్భిణులకు సీమంతం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో వీరలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీఎం సమత, ఆరోగ్యసిబ్బంది, సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, సుదారాణి, జ్యోతి, శారద పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పారిశుధ్య పనులు, తాగునీటి బావులు, ట్యాంకుల క్లోరినేషన్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి, రాజారాంపల్లి గ్రామాలలో సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి రోజు మురుగు నీటి కాల్వలను శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని, తాగు నీటి పథకాలలో బ్లీచింగ్‌పౌడర్ వేయాలన్నారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

చేనేత, హస్త కళలను ప్రోత్సహించాలి



చేనేత స్టాల్‌లో కొనుగోలుదారులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 11: చేనేత, హస్త కళలను ప్రతీ ఒక్కరూ ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు సత్య నారాయణ తెలిపారు. జగిత్యాలలోని టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాభారతి చేనేత, హస్తకళా మేళాను ప్రారంభించడం సంతోష దాయకమన్నారు. దేశ సంస్కృతిలో అంత ర్భాగ మైన చేనేతలు, హస్తకళలు, జీవన సౌందర్యానికి ప్రతీకలు అన్నారు. కళా నైపుణ్యాన్ని హస్త కళాకారులను ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21: మూడు తరాల ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని అంగడిబజార్‌లో గల బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర సాధనకోసం తన పదవిని త్యాగం చేయడంతోపాటు, తన సొంతింటిని తృణప్రాయంగా వదిలిన ఉద్యమ పిపాసి బాపూజీ అన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్‌కు తెలంగాణ గాంధీ, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ పేరును పెట్టడం హర్షణీయం అన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి మాట్లాడుతూ తన జీవితకాలం అంతా ప్రజల కోసం, స్వరాష్ట్ర సాధనకోసం పరితపించి ప్రజల హృదయాల్లో చెరగని స్థానం పొందారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా ఆయన జీవితం పోరాటంకే అంకితం చేశారని కొనియాడారు. ఉద్యమ నేత తన కోర్కైన రాష్ట్ర సాధన చూడకుండానే తుది శ్వాస విడిచారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మనమంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గుర్రం రాము, క్యాదాసు నవీన్, అల్లె గంగాసాగర్, పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బోగ గంగాధర్, గాదాసు రాజేందర్, బోగ రాజ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు ఆకుబత్తిని శ్రీనివాస్‌తో పాటు సంఘ సభ్యులు, కులబాంధవులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న జ్యోతి, శ్రావణి

●తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక అంగడిబజార్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేస్తూ, ప్రత్యేక తెలంగాణ సాధనకోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయుడు బాపూజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు విశ్వనాథం, ప్రకాష్‌రావు, విజయ్, హన్మంత్ రెడ్డి, సతీష్‌రాజు, కిషన్, గౌరీశంకర్, నర్సింగారావు, దేవేంధర్‌రావు, నారాయణ, కరుణ, విజయలక్ష్మీ తదితరులున్నారు.

●కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను, పోరాట పటిమను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీ నారాయణ, బాధ్యులు కొక్కు గంగాధర్, రాంచందర్, బొమ్మిడి నరేష్, మల్లీశ్వరీ, రాపర్తి రవి తదితరులున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

రాయికల్/సారంగాపూర్ సెప్టెంబరు 21: మండలంలోని దావన్‌పల్లికి వెళ్లే బస్సులో తాట్లవాయి గ్రా మానికి చెందిన చెల్లిపల్లి రజిత అనే మహిళ ప్రయాణిస్తూ రూ.25,500 బస్సులోనే పోగొట్టుకుంది. గమనించిన కండక్టర్ రాజారెడ్డి, డ్రైవర్ అంజిలు స్వాధీనం చేసుకుని మహిళకు తిరిగి అప్పగించారు. నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బందిని గ్రామస్థులు అభినందించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

భారత్ సురక్షా సమితి డిమాండ్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21: తిరుమల తిరుపతి లడ్డూలో జరిగిన కల్తీపై బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత్ సురక్షా సమితి నాయకులు డిమాండ్ చేశారు. కల్తీ వివాద ఘటనపై పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఏపీ మాజీ సీఎం జగన్‌ను ప్రధాన బాధ్యుడిగా చేస్తూ తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు ఏసీఎస్ రాజు, కాశీనాథం, సత్యనారాయణ, శ్రీనివాస్, రాములు, పోచమల్లు, విజయ్, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, పరంధాం, దేవన్న, రవి, గంగారాం తదితరులున్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 21 : జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన వి. రమణ (53) హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. జగిత్యాల జిల్లా పోలీస్ కంట్రోల్‌లో రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన గుండెపోటుతో శనివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శనివారం రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలోని స్వగృహంలో రమణ మృతదేహానికి ఎస్పీ అశోక్‌కుమార్ పూలమాలవేసి నివాళులు అర్పించారు.



రమణ(ఫైల్)

విష జ్వరాలపై చర్యలు తీసుకోండి

రాయికల్, సెప్టెంబరు 21: రాయికల్ పట్టణంలో గత నెల రోజులుగా ప్రబలుతున్న విష జ్వరాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయికల్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు శనివారం రాయికల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ప్రజలకు జ్వర ప్రభావం తెలియక ఇష్టారీతిన మందులు వాడుతున్నారని, అవగాహన కల్పించాలని కోరారు

ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

తహసీల్దార్‌లకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశం

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 21: ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేయాలని తహసీల్దార్‌లను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం జిల్లాలోని తహసీల్దార్‌లు, దేవాదాయ శాఖ అధికారులతో కోర్టు కేసులు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అందరు తహసీల్దార్లు వారి పరిధిలో గల ప్రభుత్వ భూముల పరిరక్షణ, దేవాదాయ శాఖ అధికారులు, వారికి సంబంధించిన భూములను సర్వే చేసి వాటి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో క్రమం తప్పకుండా భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలని మిత్తం భూములను గుర్తించి జిల్లాలో అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధు సూదన్, శ్రీని వాస్, కలెక్టర్ కార్యాలయ ఏవో హన్మంతరావు, పర్యవేక్షకులు, సంబంధిత అధి కారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సంఘం అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, సెప్టెంబరు 21: సహకార సంఘం అభివృద్ధి కోసం కలిసి కట్టుగా కృషి చేద్దామని డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సంఘం లావాదేవీల గురించి, ఆస్తి, అప్పుల గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సొసైటీ ద్వారా పొందిన రుణాలు తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. సంఘం పరిధిలో గల రైతులకు వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్, పాలకవర్గ సభ్యులు ఎల్లాగౌడ్, బల్యపెల్లి లింగన్న, లక్ష్మి, రమేష్, అశోక్, రవి, రాజు, రత్న పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

రాయికల్, సెప్టెంబరు 21: ప్రజలు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ, మండలంలోని మైతాపూర్ గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో జ్వరాల నియంత్రణ చర్యలపై సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని అల్లీపూర్ పల్లె దవాఖానాను శనివారం పరిశీలించి రికార్డులు, మందులు తనిఖీ చేశారు. రాయికల్, జగిత్యాల ఆస్పత్రిలో ప్రత్యేక పడకలు ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి సూచనలు ఇస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ సత్యనారాయణ, హెచ్ఈవో సాగర్‌రావు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ భూమయ్య పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

తల్లిదండ్రుల పోషణ విస్మరిస్తే చట్టపరమైన చర్యలు

జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గౌడ్



తల్లిదండ్రులను విచారిస్తున్న ఆర్డీవో

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21: వయోవృద్ధులైన కన్న తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత వారి పిల్లలదేనని వారిని వృద్ధాప్యంలో విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్, జగిత్యాల ఆర్డీవో పులి మధుసూధన్ గౌడ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వయోవృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం కింద దాఖలైన పిటిషన్లపై బాధితుల కుటుంబ సభ్యులు ఆర్డీవో ఎదుట విచారణకు హాజరయ్యారు. బాధితులు, వారి కుటుంబ సభ్యుల వాదనలు విని, సాక్ష్యాధారాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. తల్లిదండ్రుల ఆలనాపాలన చూడడం కొడుకులు, కూతుళ్లు, కోడళ్లదేనని విస్మరిస్తే చట్టప్రకారం శిక్షార్హులన్నారు. ఈ విచారణలో కార్యాలయ ఏవో తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటిజన్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, కమిటీ ప్రతినిధులు ప్రకాష్‌రావు, సీనియర్ సహాయకులు నర్మద, పద్మజ, ఎఫ్ఆర్వో కొండయ్య తదితరులున్నారు.

గాంధీభవన్ సమీక్ష సమావేశంలో జిల్లా నేతలు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలతో గాంధీభవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ, ఏఐసీసీ సెక్రటరీ విష్ణునాథన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు విజయరమణరావు, కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ సంజయ్‌కుమార్, శాతవాహన చైర్మన్ నరేంధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు జువ్వాడి నర్సింగారావు, రోహిత్ రావు, సత్యనారాయణ గౌడ్, పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నేతలు

ఎమ్‌స్వాస్థ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

- రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా గంభీరావుపేటలో ఏర్పాటు

గంభీరావుపేట, సెప్టెంబరు 21: గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ వైద్య సలహాల్లో భాగంగా ఎమ్ స్వాస్థ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్య సేవలను అందించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో మొదటగా గంభీరావుపేటలో నాబార్డు, సింగిల్ విండోల సహకారంతో ఏర్పాటు చేసినట్లు నాబార్డు రీసోర్స్ పర్సన్ షరీఫ్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అవరణలో నాబార్డు ద్వారా ఏర్పాటు చేసిన ఈ క్లినిక్ శనివారం ఎమ్ స్వాస్థ్ సౌత్ ఇండియా మార్కెటింగ్ రీజినల్ హెడ్ శరత్ చంద్రతో కలిసి నాబార్డు రీసోర్స్ పర్సన్ షరీఫ్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావులు ప్రారంభిం చారు. ఒక్కో కుటుంబం నుంచి 365 రూపాయలు చెల్లిస్తే ఏడాది పాటు ఉచితంగా వైద్య సేలు అందిస్తామని అన్నారు. 400 మంది వైద్యులు అన్‌లైన్‌లో సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

మానకొండూర్, సెప్టెంబరు 21: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సూచించారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజర వ్వాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించడమే కాకుండా భాషలో నైపుణ్యం సాధించాలని చెప్పారు. దీర్ఘకాలంగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం మధుసూదనాచారి, జిల్లా సమన్వయకర్త ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

గన్నేరువరం, సెప్టెంబరు 21: మండలంలోని చీమలకుంటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ పాషాను కలెక్టర్ శనివారం సస్పెండ్ చేశారు. పాషా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో సరైన ధ్రువపత్రాలు లేనప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చాడని, మ్యుటేషన్‌లు చేశాడని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గంగాధర, సెప్టెంబరు 21: గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామశివారు పరిధిలో వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఉప్పరమల్యాల శివారులో గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి బావిలో మృతి చెంది ఉన్నాడని సమాచారం రావడంతో పరిశీలించామని చెప్పారు. మృతుడు నీలిరంగు ప్యాంటు, టీ షర్టు ధరించి ఉన్నాడని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోటి రూపాయలతో ఇద్దరు పరారీ..?

హుజూరాబాద్, సెప్టెంబరు 21: హుజూరాబాద్ ప్రాంతంలో అప్పులు చేసిన ఇద్దరు వ్యక్తులు కోటి రూపాయలు చెల్లించకుండా పరారవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ఓ హోటల్ నిర్వాహకుడు 15రోజుల క్రితం రూ. 50లక్షలతో పరారీ కాగా, రెండు రోజుల క్రితం రంగాపూర్ గ్రామానికి చెందిన డేకరేషన్లు చేసే వ్యక్తి రూ. 50లక్షల రూపాయలు అప్పులు చెల్లించకుండా ఉడాయించాడు. వీరు ఇద్దరు ఏళ్లగా నమ్మకంగా వ్యాపారం చేసుకుంటుండడంతో కొంత మంది తమ వద్ద ఉన్న డబ్బులను వడ్డీ ఆశతో అప్పుగా ఇచ్చారు. వీరిద్దరూ పరారీ కావడంతో వారి ఆచూకీ కోసం బాధితులు గాలిస్తున్నారు. రెండు నెలల క్రితం ఓ బేకరి దుకాణం యజమానితో పాటు సూపర్‌బజార్ రోడ్‌లో చిట్టీలు నడి పే వ్యక్తి కూడా రూ. 1.50కోట్ల రూపాయలు అప్పులు చెల్లించకుండా పరారయ్యాడు. వరసగా నలుగురు పరారీ కావడం పట్టణంలో చర్చనీ యాంశమైంది.

మహిళ బంగారు నగలు చోరీ

చొప్పదండి, సెప్టెంబరు 21: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన మహిళ ఆరు తులాల బంగారు నగలను దుండగులు చోరీ చేశారు. ఎస్‌ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి రాధ ఆరు తులాల బంగారం చొప్పదండిలోని యూనియన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టడానికి శనివారం వచ్చింది. బ్యాంక్‌లో బంగారం కవర్ పెట్టి జిరాక్స కోసం బయటకు వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా బంగారు నగలు ఉంచిన కవర్ కనిపించలేదు. రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బందనకల్ శివారులో పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్, సెప్టెంబరు 21: మండలంలోని బందనకల్ శివారులో పేకాట రాయుళ్ల స్థావరం దాడి చేసినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ శనివారం తెలిపారు. సమాచారం మేరకు బందనకల్ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నా రు. మరో అరుగురు పరారు అయ్యారని తెలిసింది.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 8,502 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 8,502 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



బి పల్లవి | మణిచరణ్ | శశాంక్

చొప్పదండి, సెప్టెంబరు 21: ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నవోదయ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బి పల్లవి, శశాంక్, మణిచరణ్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, పీఈటీ రాధికను ప్రిన్సిపాల్ మంగతయారు శనివారం అభినందించారు. ఎంపికైన విద్యార్థులు నవోదయ విద్యాలయ జట్టు తరుపున జాతీయ స్థాయి హ్యాండ్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ మంగతయారు తెలిపారు.

భవితకు నవోదయం

- పీఎంశ్రీ స్కూల్స్‌గా జవహర్ నవోదయ విద్యాలయాలు - పేరు మార్చిన కేంద్ర విద్యాశాఖ - విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యం

చొప్పదండి, సెప్టెంబరు 21: ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత భోజన వసతితో అత్యుత్తమ విద్యను అందిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు జవహర్ నవోదయ విద్యాలయాలు పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) స్కూల్స్‌గా మారాయి. కేంద్ర విద్యాశాఖ ఈ మేరకు మార్పు చేసింది. తమిళనాడు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని 661 నవోదయ విద్యాలయాలు పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయాలుగా మార్పు చేశారు. ప్రస్తుతం ప్రతీవిద్యార్థికి ఇస్తున్న లక్ష రూపాయల బడ్జెట్‌కు అదనంగా మరో 20 వేల రూపాయలను పెంచనున్నట్లు సమాచారం. నవోదయ విద్యాలయాలు ఏర్పడిన 38 ఏళ్ల తరువాత పేరు మారడం విశేషం. కాగా నవోదయ విద్యాలయంలో ప్రస్తుతం ప్రతీ విద్యార్థిపై కేంద్ర ప్రభుత్వం ఏడాదికి లక్ష రూపాయలను ఖర్చు పెడుతోంది. పీఎం శ్రీ స్కూల్స్‌లో దీనికి తోడుగా మరో 20 వేల రూపాయల బడ్జెట్‌ను పెంచుతున్నట్లు సమాచారం. అదనపు నిధులతో విద్యార్థుల కోసం సైన్స్, సోషల్, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్ , కెమిస్ట్రీ ల్యాబ్ లను ప్రతీ విద్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ ల్యాబ్‌లు ఎంతో దోహద పడుతాయి.

● గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం..

దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ 1985లో అప్పటి అస్సాం రాష్ట్రంలోని మారుమూల గ్రామం లో పర్యటించే సమయంలో చదువు లేని చిన్నారులను గమనించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యను అందించేందుకు ఏదైనా చేయాలనే సంకల్పంతో ఢిల్లీకి తిరిగి వచ్చిన వెంటనే అప్పటి మానవవనరులశాఖ మంత్రి పీవీని పిలిచి చర్చించారు. దీంతో పీవీ నవోదయ విద్యాలయాలకు నాంది పలికారు. రాజీవ్‌గాంధీ సుముఖత వ్యక్తం చేయడంతో 1986లో పైలట్ ప్రాజెక్టుగా దేశంలో రెండు నవోదయ విద్యాలయాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నవోదయ విద్యాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం పేరు మార్పుతో అదనపు బడ్జెట్ సమకూరనుంది. దీంతో అభివృద్ధి దిశలో పయనించేందుకు నవోదయ విద్యాలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యాలయంలో 80 సీట్లకు గాను 75 శాతం మేరకు 60 సీట్లను గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 20 సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీలకు, 7.5 శాతం ఎస్టీలకు, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు సీట్లను బాలికలకు రిజర్వ్ చేస్తారు. సీబీఎస్‌ఈ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కులు, మెరిట్ కేటగిరి ఆధారంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

- వేములవాడ ప్రైవేట్ అద్దె గదిలో పురుగుల మందు తాగిన రేగొండ వాసి



కరుణాకర్‌రెడ్డి(ఫైల్).

వేములవాడ, సెప్టెంబరు 21: వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ అద్దె గదిలో పొన్నాల కరుణాకర్‌రెడ్డి (38) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన పొన్నాల కరుణాకర్‌రెడ్డి గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. శనివారం వేములవాడ జాత్రా గ్రౌండ్‌లోని ఓ ప్రైవేటు అద్దె గదిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అతడిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పౌల్ట్రీ వ్యాపారం చేసే కరుణాకర్ రెడ్డికి కరోనాకాలం నుంచి తీవ్ర నష్టాలు రావడంతో మూడు కోట్ల వరకు అప్పులైనట్టు బంధువుల ద్వారా తెలిసింది. కరుణాకర్‌రెడ్డి ఏప్రిల్‌లోనూ ఇంటి నుంచి వెళ్లిపోయి నెలరోజుల తర్వాత ఇంటికి చేరుకున్నాడు. మళ్లీ అప్పుల బాధలు తీవ్రమవడంతో మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడని బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జి కృష్ణ

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21: మండలంలోరి కొత్తపల్లి గ్రామంలో గత గురువారం జరిగిన హత్యకు సంబంధించిన నేరస్తుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఏసీపీ గజ్జి కృష్ణ వెల్లడించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి కలవేన లక్ష్మయ్య తన భార్య ఇద్దరు కొడుకులతో మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం తీగల్‌పహాడ్‌లో నివాసముంటున్నాడు. అతనికి ఇద్దరు తమ్ముళ్లు కలవేన రాజయ్య, మల్లయ్యలు గ్రామంలోనే తమకున్న భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి దగ్గరి బంధువైన కలవేన రాజేశం(68) రిటైర్డు రైల్వే ఉద్యోగి భూముల వీరి పక్కపక్కనే ఉన్నాయి. ఇక్కడే ఉంటూ సాగు చేసుకుంటున్నాడు. పదిహేనేళ్లుగా వీరి మధ్య భూతగాదాలున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయతీలు నిర్వహించగా, కోర్టులోనూ కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. కలవేన లక్ష్మయ్య, ఇద్దరు తమ్ముళ్లు రాజయ్య, మల్లయ్యలు ఈ క్రమంలో కలవేన రాజేశంపై కక్ష పెంచుకున్నారు. తరచూ జరిగే ఈ భూవివాదం, కోర్టు కేసుల నుంచి విముక్తి పొందడానికి రాజేశంను కడతేర్చేందుకు పథకం వేశారు.

ఈనెల 19న రాజేశం తన భూమిని కొలిపిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్నారు. అదును చూసి హత్య చేసేందుకు ముగ్గురు అన్నదమ్ములు సిద్ధమయ్యారు. తన భూమి వద్ద పని చేసుకొని రాజేశం ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ముగ్గురన్నదమ్ములు మాటు వేసి ఉన్నారు. రాజేశంతో కొంత సమయం పాటు కేసులు విరమించుకోవాలని వాగ్వాదానికి దిగారు. మరోవైపు రాజేశం తలపై లక్ష్మయ్య కర్రతో బలంగా బాదాడు. అలాగే పలుమార్లు బాదడంతో రాజేశం అక్కడిక్కడే మృతిచెందాడు. ముగ్గురు అక్కడినుంచి పారిపోయారు. మృతుడి కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసుకోగా, సీఐ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నేరస్థుడు లక్ష్మయ్య గ్రామంలోనే ఉన్నాడన్న సమాచారంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిపాడు. మల్లయ్య, రాజయ్యలు పరారీలో ఉన్నారని, హత్యకు ఉపయోగించిన కర్ర, మోటార్‌సైకిల్, రక్తపు దుస్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. త్వరలో పరారీలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుంటామన్నారు.

బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

- ఇప్పటికే రామగిరిలో-1, మంథనిలో-3 కేసులు

మంథని, సెప్టెంబరు 21: బెదరింపులు, అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్న మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ అలియాస్ సతీష్‌ను త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని మంథని సీఐ రాజు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మంథని పోలీసుస్టేషన్‌లో శనివారం తాజాగా ఫిర్యాదు రావడంతో ఇనుములపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు బెదిరింపులు, అక్రమ వసూళ్లకు సంబంధించి మంథని పోలీసు సేషన్‌లో మూడు, రామగిరి పోలీసుసేషన్‌లో ఇనుముల సతీష్‌పై ఒక కేసు నమోదైనట్లు తెలిపారు. పలు కేసుల్లో ఇనుముల సత్యనారాయణకు సహకరించిన రావికంటి సతీష్‌ను ఇప్పటికే అరెస్టు చేసి జైలు పంపించామన్నారు. స్థానిక కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బెల్లంకొండ రవీందర్‌రెడ్డిని రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ బెదిరించగా అతను సత్యనారాయణకు లక్ష రూపాయలు ఇచ్చాడన్నారు. మరో లక్ష రూపాయలు కూడా ఇవ్వాలని లేకపోతే ఆస్తి, ప్రాణనష్టం కలిగిస్తానని సత్యనారాయణ పలుసార్లు బెదిరించినట్లు తెలిపారు. గతంలో బాధితుడు భయపడి ఫిర్యాదు చేయలేదని, ఇప్పుడు ఫిర్యాదు చేయడంతో సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంథని ప్రాంతంలో ఇంకా ఇనుముల సత్యనారాయణ బాధితులు ఉంటే పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.





గణపతి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 21: మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన కేసులో ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ శనివారం తీర్పు వెలువరించారు. జగిత్యాల జిల్లాలోని కోడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ నాగభూషణం, మెట్‌పెల్లికి చెందిన గుండేటి మధుసూదన్ అనే ఇద్దరు అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధంచారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని కోరారు.

సిమెంట్ దిమ్మె కూలి గిరిజన మహిళ మృతి



మృతిచెందిన బానోతు లక్ష్మి

వీర్నపల్లి, సెప్టెంబర్ 21: ఉపాధిహామీ పథకం సమాచారాన్ని తెలిపేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మె కూలి గిరిజన మహిళ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండా గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు లక్ష్మి (58) తమకున్న పశువులతో మేతను మేపేందుకు అడవిలోకి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో సిమెంట్ దిమ్మె పక్కన సేదతీరేందుకు కూర్చుంది. అదే సమయంలో గేదెలు పోట్లాడుకుంటూ దిమ్మెకు తగలడంతో ఒక్కసారిగా ఆమెపై విరిగిపడింది. సిమెంట్ ఇటుకలు ఆమెకు బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సాయంత్రం అటునుంచి పశువులను తీసుకెళ్తున్న గిరిజనులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలికి భర్త రావుజి, కుమారులు సంతోష్, రమేష్ ఉన్నారు. పోలీసులు సంఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, సెప్టెంబరు 21: ధర్మపురిలో భాద్రపద మాసం శనివారం భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

● సంకటహార చతుర్థి పూజలు..

రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహార చతుర్థి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

● యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం..

యమ ధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం నిర్వహించారు.

● కొండగట్టు అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, రాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

‘మిడ్ మానేరు’ పనులపై విజిలెన్స్ విచారణ

- ఎల్ఎండీలోని ఇరిగేషన్ సర్కిల్-1లో రికార్డులు స్వాధీనం



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 21: మిడ్ మానేరు రిజర్వాయర్ పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. దీనిలో భాగంగా శనివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ సర్కిల్-1, కాళేశ్వరం సర్కిల్-1 కరీంనగర్ కార్యాలయానికి నలుగురు విజిలెన్స్ అధికారుల బృందం ఉదయం వచ్చి సాయంత్రం వరకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో డిప్యూడీ సూపరింటెండెంట్ ఇంజనీర్(డీఎస్‌ఈ) అస్మత్ అలిని కలిసిన విజిలెన్స్ అధికారులు మిడ్ మానేరు ప్రాజెక్టు పనులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని కోరారు. కాళేశ్వరం సర్కిల్-1 కార్యాలయంలో డీఎస్‌ఈ వెంకటయ్యను కలిసిన విజిలెన్స్ అధికారులు కాళేశ్వరం పరిధిలోని లింకు-3, ప్యాకేజీ-9 పరిధిలోని మల్కంపేట్ రిజర్వాయర్‌కు సంబంధించిన ఫైళ్లు అడిగి తీసుకొని పరిశీలించినట్లు సమాచారం. మిడ్‌మానేరు రిజర్వాయర్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు దానికి సంబంధించిన ఫైళ్లు తీసుకున్నట్లు సమాచారం. ఆయా ప్రాజెక్టు అంచనాలు కాలపరిమితి, పొడిగించిన కాలపరిమితి వివరాలు, టెండర్ ప్రక్రియ, బిల్లుల రికార్డులు, చెల్లింపులు, కాంట్రాక్టర్లు, అధికారుల వివరాలను విజిలెన్స్ అధికారులు కోరారు. ఆయా ప్రాజెక్టు పనుల్లో భాగంగా అప్పటినుంచి ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఇంజనీర్ల పూర్తి సమాచారం అడిగి తీసుకుంటున్నట్లు తెలిసింది. కార్యాలయంలోనే ఫైళ్లు, అగ్రిమెంట్లు ఇతర డాక్యుమెంట్లు పరిశీలించిన విజిలెన్స్ అధికారులు అనుమానం ఉన్న ఫైల్స్‌ను వెంట తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఏఈ శశిధర్, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు

జ్యోతినగర్, సెప్టెంబరు 21: రామగుండం ఎన్‌టీపీసీలో ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎన్‌టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడల ద్వారా శారీరక, మానసిక దారుఢ్యం పెరుగుతుందని అన్నారు. పాఠశాల దశ నుంచి ఏదైనా ఒక క్రీడల్లో ప్రావీణ్యం పొందేలా సాధన చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 100 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ సీజీఎం సింగరాయ, అధికారులు, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

రేపు అండర్-19 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయ నెట్స్‌లో ఉదయం 8 గంటలనుంచి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. 2005 సెప్టెంబరు1 తరువాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు క్రికెట్ యూనిఫామ్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంఘం ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు.

పోత్గల్ శివారులో చిరుత కలకలం

ముస్తాబాద్, సెప్టెంబరు 21: మండలంలోని పోత్గల్ శివారులో చిరుత కనిపించిందని జోరుగా ప్రచారం జరగడంతో ముస్తాబాద్, పోత్గల్ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు శనివారం భయాందోళనకు గురయ్యారు. పోత్గల్ దారిలోని రైస్‌మిల్ పక్కన మానేరు కెనాల్ నుంచి పోత్గల్ రామాలయం వైపు వెళ్తుండగా ఒర్రె వద్ద ఒక చిరుత, రెండు పిల్లలను చూసినట్లు ఓ రైతు చెప్పడంతో కలకలం నెలకొంది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై గణేశ్ గ్రామస్థులతో వచ్చి పులి అడుగులను పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి అడుగులు పెద్దగా ఉంటాయని అయినా రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని బీట్ ఆఫీసర్ రమేశ్ పేర్కొన్నారు.



పరిశీలిస్తున్న ఎస్సై గణేశ్, తదితరులు

అథ్లెటిక్స్‌లో చాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా జట్టు



ట్రోఫీతో అథ్లెటిక్స్ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: రాష్ట్రస్థాయి అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌ను జిల్లా క్రీడాకారులు సాధించారు. హైదరాబాద్‌లో ఈనెల 19,20 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు.

ఈ పోటీల్లో ఎం వినయ్ మూడు వేల మీటర్ల పరుగులో బంగారు, మూడువేల మీటర్ల ట్రిపుల్ చేస్‌లో కాంస్య పతకం సాధించారు. విష్ణువర్ధన్ 10వేల మీటర్ల రేస్‌వాక్‌లో బంగారు పతకం, స్వామి జావలిన్‌త్రో, డిస్కస్‌త్రోలలో బంగారు పతకాలు, సంతోష్, 5వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, విక్రమ్‌కుమార్ షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించి రాష్ట్ర చాంపియన్లుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కోచ్ తిరుపతి, వరుణ్‌లతో పాటు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్ క్రీడాకారులను అభినందించారు.

అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా పొన్నం రవిచంద్ర



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21: స్పెయిన్ దేశంలోని బార్సిలోనా పట్టణంలో జరగనున్న 31వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు, ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ అసిస్టెంట్ జెనరల్ సెక్రెటరీ డాక్టర్ పొన్నం రవిచంద్ర ఎంపికయ్యారు. ఈ ఏడాది నవంబరు 14 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న ఈ చిత్రోత్సవానికి స్పెయిన్ నుంచి లొర్డేశ్ ఫెక్సియా, నార్వే నుంచి విలియం సవేరేసెన్, ఇండియా నుంచి పొన్నం రవిచంద్రలను జ్యూరీ సభ్యులుగా నియమిస్తూ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ కార్యదర్శి బీఎస్ఎస్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. రవిచంద్ర గతంలో నంది సినిమా అవార్డుల జ్యూరీ సభ్యునిగా, పోర్చుగల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యుడిగా పని చేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

- పాల్గొన్న 19 బాలికల, బాలుర జట్లు



సాఫ్ట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21: తెలంగాణ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభం అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాల నుండి 19 బాలికలు జట్లు, 19 బాలుర జట్లు వచ్చాయి. శనివారం నుండి సోమవారం వరకు మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మొట్ట మొదటి సారిగా జరుగుతున్న సాఫ్ట్ బాల్ పోటీలను తిలకించడానికి స్థానిక ప్రజలు ఆశక్తి చూపుతూ క్రీడా మైదానం వస్తున్నారు. మొదటి రోజు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలను నిర్వాహకులు ఎలాంటి అట్టహాసం లేకుండా, ముఖ్య అతిథులు ఎవరిని ఆహ్వానించకుండా సాదాసీదాగా ప్రారంభించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు, జట్ల కోచ్‌లు, మేనేజర్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలి



కోరుట్లలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా లక్ష్మణ్ బాపూజీ

కోరుట్ల, సెప్టెంబరు 21 : కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యమ స్ఫూర్తితో మనం ముందకు వెల్లాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్ అన్నారు. శనివారం పట్టణంలోని కార్గిల్ చౌరస్తాలోని కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను పద్మశాలి సంఘం, మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీని వాస్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, యువజన సంఘం అధ్యక్షుడు సతీష్, కౌన్సిలర్లు సత్యనారాయణ, అనిల్, హనుమాన్ దేవాలయ చైర్మన్ గంగాధర్, ప్రధాన కార్యదర్శి సంజీవ్, ఉపాధ్యక్షుడు సతీష్, రవి, కళ్యాణ్, లఖన్, ఇటిక్యాల సంఘం అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి నవీన్ పాల్గొన్నారు.

పెగడపల్లి : పెగడపల్లి మండల కేంద్రంలో శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు గాజుల గంగామల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు దశరథం, డాక్టర్ వాహిని, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌గౌడ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) : పట్టణంలోని శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో, టీజేఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేర్వేరుగా శనివారం కొండా లక్ష్మణ్ బాపుజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీజేఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి, శంకర్, తిరుపతి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లింగం, మండల అధ్యక్షులు అంజిరెడ్డి, రాజగోపాల్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు రాజారాం పాల్గొన్నారు.



రాయికల్‌లో పాల్గొన్న సంఘ నాయకులు



మెట్‌పల్లిలో బాపుజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి రూరల్ : కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి పురస్కరించుకొని మండలంలోని వేంపేట గ్రామంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని అయిలాపూర్‌లో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలి సంఘ నాయకులు కటకం గణేష్, విష్ణు, రామకృష్ణ, వాసం నరేష్, ఎన్నం రాజేష్‌లతో పాటు పలువురు నివాళులు అర్పించారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని పద్మశాలీ సేవా సంఘ భవనంలో శనివారం కొండ లక్ష్మన్ బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షుడు రాజేశం, సంఘం నాయకులు జనార్దన్, కె. సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తం

గొల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని ఏఎంసీ చైర్మన్ భీమసంతోష్ మహిళలకు సూచించారు. గొల్లపల్లి మండల కేంద్రం లో శనివారం శ్రీ సాయి మండల మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకం కింద 40 మంది మహిళకు మంజూరైన 800 పెరటి కోళ్లను ఏఎంసీ చైర్మన్ పంపిణీ చేశారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న 8 ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం 150 దరఖాస్తులు వచ్చాయని ప్రిన్సిపాల్ మార్గం అనిత తెలిపారు. పీజీటీ విభాగంలో పొలిటికల్ సైన్స్, కామర్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథమెటిక్స్, ఇంగ్లీష్, టీజీటీలో సైన్స్, సోషల్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా దరఖాస్తులు ఆహ్వానించినట్టు చెప్పారు. ఈనెల 23న అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

మల్లాపూర్: మల్లాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంతడుపుల పుష్పలత- నర్సయ్య, వైస్ చైర్మన్‌గా నారాయణరెడ్డిల పేర్లు ఖరారుకావడంతో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సబంబరాలు జరిపారు. మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి మాట్లాడుతూ ఏఎంసీ ఎన్నికకు సహకరించిన జువ్వాడి నర్సింగ రావు, కృష్ణరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని చౌలమద్ది అనుబంధ గ్రామమైన మారుతినగర్ గ్రామ వాసి శనిగరపు విజయ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కామర్స్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అమాంగ్ ఎంఎస్ఎంఎఈ ఇన్ తెలంగాణ-ఏ సెలక్ట్ స్టడీ ఆఫ్ ఉమ్మడి నల్గొండ జిల్లా అంశంపై ఆయన పరిశోధనకు డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ అసోసిమెట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, కో సూపర్ వైజర్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌మూర్తిల చేతుల మీదుగా అందుకున్నాడు.

మెట్‌పల్లి,(ఇబ్రహీంపట్నం): బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు పండిత్ దిన్ దయాల్ మహాత్మ గాంధీ జయంతిని పురష్కరించుకొని సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవ పక్షం పేరుతో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ తెలిపారు. సేవ పక్షంలో భాగంగా శనివారం 15 మంది బీజేపీ యువ నాయకులు రక్తదానం చేసినట్లు తెలిపారు.

జగిత్యాల అర్బన్: చదువుకున్న యువతే దేశానికి మానవ వనరులని, వారే దేశ సంపద అని వైద్యులు డాక్టర్ బీఎస్‌రావు అన్నారు. శనివారం జగిత్యాల గ్రంథాలయంలో బీఎస్ రావు ఫౌండేషన్ ద్వారా పుస్తకాలను అందజేశారు. మహిళ డిగ్రీ కళా శాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్య క్షుడు లక్ష్మారెడ్డి, వంగలి రాజం, లైబ్రేరియన్ శకుంతల పాల్గొన్నారు.

మెట్‌పల్లి,(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని 14వ వార్డుకు చెందిన దనుసారం సావిత్రి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీజేవైఎం నాయకులు దొనికెల నవీన్ 2 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

జగిత్యాల అగ్రికల్చర్: గల్ఫ్ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ చాంద్‌పాషాను హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎన్నారై ప్రెసిడెంట్ డాక్టర్ వినోద్ కుమార్ చేతులమీదుగా ఘనంగా సన్మానించారు.

బుగ్గారం: మండలంలోని వెల్గొండ గ్రామ అనుబంధ గ్రామం గుండ్లపల్లికి చెందిన ఓటర్ల పేర్లు కొన్ని 3వ వార్డులో మరి కొన్ని పేర్లు 4వ వార్డులో ఉండడంతో గ్రామ అభివృద్ధి జరగడం లేదని ఓటర్ల పేర్లు అన్నీ ఒకే వార్డులో కలపాలని కోరుతూ శనివారం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు.

మల్యాల: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ పార్టీ కార్యకర్తలకు పిలుపినిచ్చారు. మల్యాలలో శనివారం మల్యాలలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమే పాల్గొన్నారు. నియోజకవర్గంలోనే సభ్యత్వ నమోదులో మల్యాల మండలం మొదటి స్థానంలో నిలువాలని ఇందుకు బూత్ అధ్యక్షులు కష్టపడాలని అన్నారు. అనంతరం మండల సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జీగా మండల శాఖ ప్రధాన కార్యదర్శి గాజుల మల్లేశంను నియమించారు.

●మండలంలోని మల్యాల, ముత్యంపేటలో శనివారం పద్మశాలి సేవా సంఘాల ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సారంగాపూర్: ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో గల కస్తూరిభా బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎల్‌డీఎం రాంకుమార్ ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సంస్థ కౌన్సిలర్స్ విద్యార్థులకు బ్యాంకు వల్ల ఉపయోగాలు, సైబర్ నేరాలపై అవాహన కల్పించారు.

రాయికల్: ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో ఆదివాసీ మహిళపై జరిగిన లైంగిక దాడి ఘటనలో నిందితులను పట్టుకుని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ రాయికల్ డీటీ గణేష్‌కు వినతి పత్రం సమర్పించారు.

ఓటర్లకు ఇబ్బందులు కలగొద్దు: కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్, సెప్టెంబరు, 21: గ్రామాల్లోని ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని, విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై ఎమైనా అభ్యంతరాలు ఉంటే ఆయా గ్రామాల్లోని కార్యదర్శులకు తెలపాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని కొత్తధామ్‌రాజుపల్లిలోని ఓటరును వార్డు మార్చరంటూ, సాతారాం గ్రామానికి చెందిన బింగి నవీన్‌ను ఓటర్ జాబితలో నుంచి తొలగించారని చేసిన ఫిర్యాద్ మేరకు శనివారం కలెక్టర్ సందర్శించారు. గ్రామాల్లోని వారి ఇంటికి స్వయంగా వెళ్లి సమస్యను తెలుసుకుని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్‌లోని అభ్యంతరాలను సేకరించి పారదర్శంగా ముసాయిదా ఓటర్ జాబితాను తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీపీవో రఘువరన్, తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐ రాజేష్, కార్యదర్శి, బీఎల్‌వోలు, సిబ్బంది, పాల్గొన్నారు.

'స్వచ్ఛత హీ సేవ' విజయవంతం చేయాలి

కోరుట్ల, సెప్టెంబరు 21 : స్వచ్చత హీ సేవా కార్యక్రమాలలో నిర్వహించే అవగాహన సదస్సులను విజయవంతం చేసి కోరుట్ల పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు అన్నారు. శనివారం పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్చత హీ సేవ కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తడి, పొడి, చెత్త వేరుచేసే విధానంపై అవగాహన కల్పించి తల్లి దండ్రులకు వివరించాలని సూచించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, ప్రదానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ



లబ్ధిదారుల లిస్ట్‌ను ప్రదర్శిస్తున్న కౌన్సిలర్ జయలక్ష్మి

కోరుట్ల, సెప్టెంబరు 21 : రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హమీలను నేరవేర్చి ప్రజల ఇబ్బందులు తొలగిస్తుందని 24వ వార్డు కౌన్సిలర్ శీలం జయలక్ష్మి-వేణుగోపాల్ అన్నారు. శనివారం వార్డులో మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల పత్రాలను ప్రదర్శించి మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ద్వారా వంట గ్యాస్ సిలిండర్ రూ. 500లకే వస్తుందన్నారు. అదే విధంగా పట్టణంలోని అన్ని వార్డులలో లబ్ధిదారులకు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి హుండీ లెక్కింపు

బీర్‌పూర్, సెప్టెంబరు 21: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని శనివారం ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అన్ని హుండీలను విప్పిలెక్కించగా ఆలయానికి వచ్చిన హుండీ ఆదాయం రూ. 4లక్షల 48వేల 405లు వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా పరిశీలకులు రాజమౌళి, ధర్మపురి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, దేవస్థానం మాజీ ఉత్సవ కమిటీ సభ్యులు స్మామాట్, బ్యాంక్ సిబ్బంది, పోలీస్ సిబ్బం ది, అర్చకులు వొద్దిపర్తి సంతోష్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న న్యాయమూర్తి

కోరుట్ల సెప్టెంబరు 21: పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయంలో శనివారం జగిత్యాల జిల్లా న్యాయమూర్తి అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. దేవాలయానికి వచ్చిన న్యాయమూర్తికి పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలను నిర్వహించి న్యాయమూర్తి కుటుంబ సభ్యులను అశీర్వదించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అరుణ్‌కుమార్‌కు దేవాలయ జ్ఞాపికతో పాటు శేష వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు బానుమూర్తి, దేవాలయ జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సన్మానించిన పీసీసీ అధ్యక్షుడు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21:తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నలభై ఏళ్లుగా కాంగ్రెస్‌పార్టీ ఉన్నతికి ఎనలేని సేవలు చేశారన్నారు. జీవన్‌రెడ్డి సేవలను పార్టీ గుర్తుంచుకుంటుందని, భవిష్యత్‌లో సేవలు పార్టీకి వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే జీవన్‌రెడ్డిని ఉన్నత స్థానంలో నిలబెట్టి గౌరవిస్తామని మహేష్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

వెల్గటూర, సెప్టెంబరు 21: మండలంలోని పాసిగామ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయు రాలుగా పని చేసిన యాదలక్ష్మి, పదమూడేళ్ల పాటు ఉపాధ్యాయురాలిగా పని చేసిన చంద్రకళలను విద్యార్థులు, తల్లిదండ్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంపతకుమార, ఉపాధ్యాయుడు చిప్ప మహేస, సీఆర్పీ వెంకటేస, అమ్మ ఆదరశ పాఠశాల కమిటీ చైర్మన గుండ మంజుల, లత, రాజేశ్వరి, గోపతి నరేస, శ్రీదర, నాగరాజు, ప్రవీణ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 21 : పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. శనివారం రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామాన్ని ఆమె సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి కిరీటి, ప్రధానోపాధ్యాయుడు మురళీమనోహరచారి పాల్గొన్నారు.

సభ్యత్వాల్లో పాత విధానం కొనసాగింపుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న మత్స్య సహకార సంఘ బాధ్యులు, సభ్యులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో నూతన సభ్యత్వాలకు పాత విధానం కొనసాగించేలా జారీ చేసిన జీవోపై జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ పార్టీ జగిత్యాల విభాగం బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, తెలంగాణ ఫిషరీష్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయిల చిత్రపటాలకు జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగపుత్రుల అభ్యున్నతికై కార్పోరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యత్వాలకు వ్యక్తిగతంగా కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఖచ్చితం అనే నిబంధన తీసుకురాగా, స్థానిక జిల్లా మత్స్యకార సంఘ బాధ్యులు సమస్యను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికి విషయాన్ని వివరించారన్నారు. స్పందించిన సాయి సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో డైరెక్టర్ ఫిషరీష్ డాక్టర్ ప్రియాంక అల పాత విధానంలో సభ్యత్వం కొనసాగుతుందని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ జీవో జారీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పెద్దల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషర్‌మెన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మెన్ తోపా రఘు రంజిత్‌కాంత్, ఉమేందర్, చిట్యాల నారాయణ, అంజయ్య సంఘ సభ్యులున్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, సెప్టెంబరు 21: అక్రమంగా కొను గోలు చేసి నిల్వ ఉంచిన సుమారు 50 క్వింటాళ్ల రేషన్‌బియ్యంను అధికారులు పట్టుకున్నారు. ముత్యంపేట వరదకాలువ శివారులో బియ్యం అక్రమంగా నిల్వచేశారని హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందిన సమాచారం మేరకు బియ్యం పట్టుకొని సివిల్‌సప్లై గోదాంకు తలించారు. బియ్యం పట్టుకున్న వారిలో సివిల్‌సప్లై డీటీ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ షైమద్, కానిస్టేబుల్ ప్రసాద్ ఉన్నారు

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 21: జగిత్యాల పట్టణంలోని పలు హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష శనివారం తనిఖీలు నిర్వహించారు. పలు హోటళ్లలోని ఆహార పదార్థాల శాంపిల్స్‌ను ఆమె సేకరించారు. పలు హోటళ్లలో నాణ్యత లేని ఆహార పదార్థాలను చెత్తబుట్టలో పారవేశారు. సేకరించిన శాంపిల్స్ ను పరీక్షించిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని అనూష తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న పాఠశాల బస్సు

ఇద్దరికి తీవ్ర గాయాలు..

ఎండపల్లి, సెప్టెంబర్ 21: ధర్మారం మండలంలోని ఓ పాఠశాల బస్సు సాయంత్రం పిల్లలను ఇంటికి చేర్పించే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. మండలంలోని చెర్లపల్లి గ్రామం వద్ద ఆత్మాకూర్ మూల మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. పెగడపల్లి నుంచి గుల్లకోట వైపు వస్తున్న ద్విచక్ర వాహనం, రాజారాంపల్లి నుంచి చెర్లపల్లి వైపు వెళ్తున్న పాఠశాల బస్సు మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న పెగడపల్లి మండలం దీకొండ గ్రామానికి చెందిన గోపులాపురం గోపాల్, ఏడుమోటలపల్లికి చెందిన రాచర్ల శంకర్‌లకు గాయాలయ్యాయి. గోపాల్ కాలు విరగగా, శంకర్ తల పగిలింది. ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. పట్టణం లోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వచ్చతహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని, ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థులచే స్వచ్చత ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించి, కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్లబ్ సేవలు విస్తరించడం అభినందనీయం

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నడిపల్లి వేంకటేశ్వర్ రావు



నూతన సభ్యులను సన్మానిస్తున్న జిల్లా లయన్స్ క్లబ్ సభ్యులు

కోరుట్ల, సెప్టెంబరు 21 : గ్రామీణ ప్రాంతాల్లో క్లబ్ సేవలు విస్తరింప చేయడం అభినందనీయమని, మరింత సేవలు అందించి రాణించాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నడిపల్లి వేంకటేశ్వరరావు సూచించారు. శనివారం మండలం లోని అయిలాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకరంలో క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ కొండనంద రాములు, రీజినల్ ఆర్గనైజర్ సురేష్, క్లబ్ రెండవ జిల్లా వైస్ గవర్నర్ మోర భద్రీశంలతో కలిసి జిల్లా గవర్నర్ నడిపల్లి వేంకటేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్బంగా నూతనంగా ఎంపికైన క్లబ్ అధ్యక్షుడు నగునూరి గంగాధర్, ప్రధాన కార్యదర్శి దీకొండ రాజ నర్సయ్య, కోశాధికారిగా మాసుల ఆశోక్ కుమార్ కార్యవర్గ సభ్యులుగా బొల్లపల్లి రాజలిం గం గౌడ్, బొల్లపల్లి అరుణ్ విశాల్, సంతోష్, ప్రకాశ్, జలపతి రెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, నరేష్, క్లబ్ సభ్యులు కోరుట్ల లయన్స్ క్లబ్ సభ్యులు, కోటీ నవదుర్గ మహిళ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ



మాట్లాడుతున్న సీడీపీవో మణెమ్మ

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 21 : పౌష్టిక ఆహారంతో గర్భిణులు సంపూర్ణ ఆరోగ్య వంతుగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ అన్నారు. అంగన్‌వాడి మండల స్థాయి సమావేశం మండల ప్రజాపరిషత్ సమావేశం మందిరంలో ఎంపీడీవో రామ కృష్ణలతో కలిసి పాల్గొని అవగాహన కల్పించారు. ఎంపీవో కృపాకర్, ఏపీఎం శంకర్, అంగన్ వాడి సూపర్ వైజర్లు రాధిక, భారతి, హేమలత, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికల్లో రక్తహీనత నివారించుటకోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, దీనిలో భాగంగానే పోషణమాస కార్యక్రమాలను నిర్వహిస్తుందని సీడీపీవో మమత అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామంలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా పోషణమాసం, ఆరోగ్య లక్ష్మీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశ్రీ, లావణ్య, భాగ్యలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ వనిత, ఏఎన్ఎం సమత, ఆశ మంజుల, ఆయా మౌనిక గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

●మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా పోషణమాస కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు రక్తపరీక్షలు, సీమంతాలు, పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ సౌమ్య, ఏఎన్ఎం శైలజ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, తల్లులు, పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో పోషణ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం ఆరోగ్యలక్ష్మి సమావేశం, వాటి ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ సహార, ఆశ కార్యకర్త వనిత, ఆరోగ్యలక్ష్మి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకో వడం వలన సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా అన్నారు. పోషణ్ మాసోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ, బాలింతలకు, చిన్నారుల తల్లిదండ్రులకు పౌషికాహారంపై అవగాహనతో పాటు విద్యకు సంబంధించిన ప్రాధాన్యతను వివరించారు. అనంతరం పిల్లల బరువు, ఎత్తులు, జబ్బుచుట్టు కొలతలను పరిశీలించి తక్కువ ఉన్న వారి తల్లిలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు బిజ్జారపు శ్రీదేవి, రాజేశ్వరి, ప్రమీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మమత



ఆత్మకూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా